క్లుప్తంగా

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు చెప్పారు. డీఈఓగా అరుణ్, ఎంఈఓగా గీతిక, హెచ్‌ఎంగా మల్లేష్ చక్కగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ భాగ్యమ్మ, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, గీత పాల్గొన్నారు.

ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో పండుగలను అందరూ కలిసిమెలిసి నిర్వహించుకున్నప్పుడే పండుగ ఉత్సవం ఏర్పడుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని సురంగల్ గ్రామంలో ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ దేవత కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను గ్రామ సర్పంచ్ లావణ్య, మాజీ సర్పంచ్ చంద్రయ్య కలిసి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, నాయకులు భాస్కరాచారి, మహేష్‌యాదవ్, చింతకింది ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, భక్తులు

షాద్‌నగర్: మండలంలోని ఏనగడ్డ తండాలో శుక్రవారం దుర్గామాత, సేవాలాల్ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమృతమ్మ, ఎంపీటీసీ లావణ్య, నాయకులు నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్ నాయక్, బాబు నాయక్, శివ, బిల్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదల సంక్షేమం

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మెట గ్రామంలో హాత్‌సేహాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు వసంతం, దర్శన్, మండల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మానయ్య, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ డీ వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజిద్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీను, ఉప సర్పంచ్ కృష్ణగౌడ్, పాల్గొన్నారు.

సీపీఐ నాయకులపై కేసులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసి అక్రమించిన సంఘటనలో పలువురు సీపీఐ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల సర్వే నంబర్ 75లోని ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తుల ప్రోద్బలంతో గుడిసెలు వేసినట్లు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జంగయ్య, వినోద, కుమార్ తోపాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.



కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా చేవెళ్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



షాద్‌నగర్ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



మొయినాబాద్ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేలు వారివారి కార్యాలయాల్లో కేక్ కట్ చేశారు.



కొత్తూరు: మహిళకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కొందుర్గు: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పెళ్లి విందులో రక్తదాన శిబిరం

మొయినాబాద్ రూరల్: పెళ్లి విందులో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని మొయినాబాద్ సీఐ లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, నక్కలపల్లి జంగారెడ్డి అన్నారు. మండలంలోని అమ్డాపూర్‌లో ఎన్కెపల్లి ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఈ శిబిరాన్ని తన పెళ్లి విందులో కొనసాగించాలని వరుడు కృష్ణ యాదవ్, వధువు కీర్తికుమారి కోరారు. వారి కోరిక మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు ఎన్కెపల్లి ప్రభాకర్‌యాదవ్ తెలిపారు. గ్రామానికి చెందిన ప్రభాకర్ యాదవ్ 35 సార్లు రక్తదానం చేసి అవార్డు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరు రవళి. మాజీ ఎంపీటీసీ బాత్కూ అంతయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు లక్ష్మీపతి యాదవ్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి, నాయకులు ప్రకాష్, జంగారెడ్డి, వధూవరులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే రామస్వామి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇళ్ల స్థలాల కోసం ఆందోళన చేస్తున్న వారికి శుక్రవారం ఆయన మద్దతు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బుల్, నాయకులు అంజయ్య, సుధాకర్‌గౌడ్, మాదవి, మంజుల, కృష్ణయ్యగౌడ్, లక్ష్మన్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శివయ్య, మల్లేశ్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



పేదలు వేసుకున్న గుడారంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి శివస్వాములు

కొందుర్గు: మండల దీక్ష తీసుకున్న శివస్వాములు శుక్రవారం శ్రీశైల మల్లన్న ఆలయానికి బయలుదేరారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన పలువురు స్వాములు గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో బయలుదేరారు. అంతకు ముందు పద్మారం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం, కొందుర్గు ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో జ్యోతిర్ముడి కార్యక్రమం నిర్వహించారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మిదేవిపల్లి గ్రామంలోని శివాలయంలో శాంతి హోమం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

ఎలికట్ట నుంచి..

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని శివ హనుమాన్ ఆలయంలో శివ దీక్ష చేపట్టిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం గురుస్వామి కృష్ణయ్య ఆధ్వర్యంలో గురుస్వామి మల్లేష్ పూజారి శివ స్వాములకు ఇరుముడిని కట్టారు. మాల ధరించిన స్వాములు 41రోజుల పాటు శివ దీక్ష తీసుకున్నారు. దీక్ష పూర్తి కావడంతో శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.



కొందుర్గు: పూజలో పాల్గొన్న శివస్వాములు

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర

- మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయం
- 24వరకు ప్రత్యేక కార్యక్రమాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి జాతరకు ముస్తాబైంది. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏటా శివరాత్రి పండుగ నుంచి వారం రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు దుకాణాలు వేసుకుంటున్నారు. పిల్లల కోసం రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీటి వసతి, స్నాన ఘట్టాలు వంటి ఏర్పాటు చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మేనేజర్ శ్రీనివాసులు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ, ప్రధాన అర్చకులు తెలిపారు.

ఆలయ చరిత్ర

చేవెళ్లలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. నమ్మిన భక్తులకు కొంగు బంగారంగా వెలిసిన చేవెళ్ల వెంకన్నను తిరుమల తిరుపతి దేవునిగా కొలుస్తారు. ఈ ఆలయానికి మాన్యాలు, భూములు, ఉన్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి ఎంతో మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు.

స్వామివారికి నిర్వహించే ఉత్సవాలు

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 18న గణపతి పూజ, పుణ్యాహవాచన మహా శివరాత్రి అభిషేకం, కలశస్థాపన, కుంభ పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం, తీర్థ ప్రసాద నివేదనం, 19న అభిషేకం, అర్చనలు, రాత్రి 10 గంటలకు దోపోత్సవం, అశ్వవాహన సేవలు ఉంటాయి. మార్చి 7న అఖండ హారతితో కార్యక్రమాలు ముగిస్తాయి. దోపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

రవాణ సౌకర్యం

చేవెళ్లకు హైదరాబాద్ నుంచి వికారాబాద్, తాండూర్, పరిగి డిపోలకు చెందిన బస్సులు వస్తాయి. హైదరాబాద్ డిపో బస్సులు, కర్ణాటక, బీజాపూర్ వెళ్లే బస్సులు చేవెళ్లలో ఆగుతాయి. దీంతో పాటు సంగారెడ్డి, శంకర్‌పల్లి, షాదనగర్, శంషాబాద్‌ల నుంచి కూడా చేవెళ్లకు బస్సుల సౌకర్యం ఉంది.



చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం



మూలవిరాట్టు

ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ అవసరం

ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మహేందర్

షాద్‌నగర్ రూరల్: నేడు మనం చేసే పొదుపు రేపటి మన జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మహేందర్ కల్వకోల్ అన్నారు. పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫైనాన్షియల్ లిట్రసీ వీక్ 2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు పొదుపుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేసుకోవాలని సూచించారు. ఆదాయానికి మించిన ఖర్చులతో అవస్థల పాలవుతారన్నారు. ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతామని అన్నారు. పొదుపు సూత్రాన్ని పాటిస్తే తన కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఖాతాదారులు మీకు వీలైనంత మొత్తాన్ని పొదుపు చేసుకుంటే మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యుడు వెంకన్నబాబు, అసిస్టెంట్ మేనేజర్ సుధీర్, రుణ పర్యవేక్షణ అకారిణి రిమారోషిని, క్యాషియర్ డయానా పీటర్, సునీల్‌రెడ్డి, సుజాత, మనీష్ పాల్గొన్నారు.



పొదుపు కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు, ఖాతాదారులు

ప్రయాణం.. ఒళ్లు హూనం

- దెబ్బతిన్న చంద్రాయణ్‌గూడ – మామిడిపల్లి రోడ్డు
- పది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- గుంతలతో దెబ్బతింటున్న వాహనాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- టెండర్లు పిలిచినా.. ముందుకురాని కాంట్రాక్టర్లు



గుంతలమయంగా మారిన మామిడిపల్లి బీటీ రోడ్డు

నందిగామ: మండలంలోని చంద్రాయణ్‌గూడ – మామిడిపల్లి రోడ్డులో ప్రయాణం అంటే ప్రజలు హడలిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని 9 కిలో మీటర్లలో సగం మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పరిశ్రమల కారణంగా నిత్యం ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఈ రోడ్డు ఎప్పటికి బాగు పడుతుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. చంద్రాయణ్‌గూడ – మామిడిపల్లి మార్గంలో అప్పారెడ్డి గూడ, వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మజీద్ మామిడిపల్లి, మంచన్ పహాడ్, మామిడిపల్లి గ్రామాలు ఉన్నాయి. చంద్రాయన్ గూడ నుంచి వీర్లపల్లి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వీర్లపల్లి శివారులోని పరిశ్రమలకు ఓవర్ లోడుతో లారీ లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా కూడా రోడ్డు దెబ్బతింది. గతేడాది చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడ వరకు బీటీ రోడ్డును బాగు చేశారు. అప్పారెడ్డిగూడ నుంచి మొదళ్లగూడ శివారు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

టెండర్లు పిలిచినా స్పందన కరువు

అప్పారెడ్డిగూడ నుంచి మామిడిపల్లి వరకు 3.5 కిలో మీటర్ల రోడ్డు ఉంది. దీన్ని బీటీగా మార్చేందుకు రూ. 2కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయి. రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో అధికారులు సైతం చేసేది ఏమీలేక మిన్నకుండిపోయారు. అధికారులు అంచనా వ్యయం కంటే తక్కువగా నిధులు కేటాయించారన్నది కాంట్రాక్టర్ల అభిప్రాయం. ఈ కారణంగానే వారు పనులు చేసేందుకు ముందుకు రాలేదని తెలిసింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆ రోడ్డు అంటేనే భయమేస్తోంది



గుంతలమయంగా మారిన చంద్రాయణ్‌గూడ - మామిడిపల్లి రోడ్డు అంటేనే భయమేస్తోంది. ఈ మార్గంలో ప్రయాణం చేయలేక పోతున్నాం. గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీలైనంత తొందరగా రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి.

– సీతారాం, ఉప సర్పంచ్, అప్పారెడ్డిగూడ

కాంట్రాక్టర్లు రావడం లేదు

అప్పారెడ్డిగూడ నుంచి మామిడిపల్లి వరకు 3.5 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2కోట్ల 50లక్షలు మంజూరయ్యాయి. రెండు సార్లు టెండర్లు పిలిచాం. కానీ కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– సందీప్, ఆర్‌అండ్‌బీ ఏఈ

భూ రికార్డులు సరిచేయాలని వినతి



తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొత్తూరు: మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పొలాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సరిచేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 255లో ఉన్న విస్తీర్ణం 52.16 పొలం పాత రికార్డుల్లో పట్టాగా ఉందన్నారు. ధరణి కంటే ముందు ఈ పొలాలను కొందరు విక్రయించగా చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు సైతం అయినట్లు పేర్కొన్నారు. కాగా ధరణి తర్వాత ఈ సర్వే నంబర్‌లోని పొలం అసైన్డ్ భూమిగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. దానికి తోడు ధరణిలో కొందరి విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులుగా ఉన్నాయని వాపోయారు. రెవెన్యూ అధికారులు అన్ని రికార్డులను పరిశీలించి తప్పులను సరిచేసి మా పొలాలకు పట్టా పత్రాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, ఎల్లయ్య, వెంకటేష్, ప్రభాకర్, శంకరయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

కేశంపేట: మండలంలోని అల్వాల గ్రామ రైతు వేదికలో శుక్రవారం రైతుబంధు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అల్వాల క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులతో కలిసి మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ రైతుబంధు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు.